

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారానికి 23.118 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి వరద ప్రవాహం 490 క్యూసెక్కులుగా ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,180
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,494
3 శాతం జీఎస్టీతో	రూ.5,659
నవర (8 గ్రా)	రూ.45,272

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /28.5

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలిలో 56 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ఒడిలో ప్రశాంత జీవనం సాగించే ఆదివాసీలు స్వచ్ఛమైన మనసుకు, మానవ సంబంధాలకు ప్రతిరూపాలని, వారికి ప్రత్యేక స్థానం ఉంటుందని కొనియాడారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి, వారి అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. గిరిజన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. గిరిజనుల ఆరోగ్యం, విద్య, నీటి సరఫరా, విద్యుత్, రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.

11న ఐటీఐలో జాబ్‌మేళా

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ బాలుర ఐటీఐ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఆరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ మేళా నిర్వహిస్తారన్నారు. ఆటోసెన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, టీసీఎల్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ స్మార్ట్, అపోలో ఫార్మసీ, ఎస్‌ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అమరరాజ బ్యాటరీస్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్‌ఎస్‌సీ నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. వయసు 18 నుంచి 28 ఏళ్ల లోపున్న వారు హాజరుకావాలన్నారు. ఆధార్‌కార్డు జెరాక్స్, బయోడెటా తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. రిజిస్ట్రేషన్లను ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 97045 10793, 93812 65558 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

ఫెన్సింగ్ జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భీమవరంలో ఈనెల 12వ తేదీ నుంచి జరిగే 9వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ బాలబాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్ల ఎంపికలను ఈనెల 10వ తేదీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలను నెల్లూరులోని కేవీఆర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తామన్నారు. పాల్గొనే వారు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ నంబర్‌తోపాటు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు, వ్యక్తిగత ఫెన్సింగ్ ఎక్విప్‌మెంట్‌తో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 91604 34771, 98660 46081 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

జలవనరుల శాఖ డీఈ సరెండర్

ఉదయగిరి: ఉదయగిరి జలవనరుల శాఖ డీఈ శంకరనారాయణను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోగా ఈ విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయన ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చెరువుల్లో మట్టి తవ్వకాలు, కంపచెట్ల నరికివేతకు అనుమతులివ్వడంతోపాటు గండిపాళెం జలాశయం నుంచి అనధికారికంగా దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయడం, తదితర అంశాలపై ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కాగా ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి డీఈగా వ్యవహరిస్తున్నారు.

పాల కల్తీకి చెక్



కొందరు కాసులకు కక్కుర్తిపడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వినియోగించేది మేము కాదుగా.. ఎవరేమైపోతే మాకేంటి అనేలా వారి తీరు ఉంది. అక్రమార్కులు పాలను కల్తీ చేస్తున్నట్లు ఇటీవల అధికారులు గుర్తించారు. వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన పాలు అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. దీంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పాల కల్తీకి చెక్ పెడుతున్నారు.

చక్కెర, సన్‌ఫ్లవర్ ఆయిల్ కలుపుతున్న వైనం

- ఇటీవల గుర్తించిన అధికారులు
- ఆరుగురికి రూ.1.20 లక్షల జరిమానా
- కల్తీ చేస్తే కఠిన చర్యలు





పాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో పదుల సంఖ్యలో పాల డెయిరీలున్నాయి. అధికారుల లెక్కల ప్రచారం వాటి ద్వారా సుమారు 3 లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది. 2 లక్షల లీటర్ల వరకు పాలు ప్యాకెట్ల రూపంలో విక్రయాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా కొన్నిచోట్ల స్థానికంగా పాలను విక్రయిస్తున్నారు. ఆ సంఖ్య కూడా దాదాపుగా 70 వేల లీటర్ల వరకు ఉంటుందని అంచనా. ఇదిలా ఉండగా రైతుల వద్ద కొనుగోలు చేసిన పాలను కొందరు ఏజెంట్లు కల్తీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా చక్కెర, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను బాగా మిక్స్ చేసిన తర్వాత దాన్ని స్వచ్ఛమైన పాలల్లో కలుపుతుంటారు. ఇలా చేయడంతో ఫ్యాట్ శాతం పెరుగుతుంది.

ఈ ప్రాంతాల్లో వెలుగులోకి..

ఏఎస్‌పేట మండలం పెద్దఅబ్బీపురం ప్రాంతంలో ఐదుగురు పాల సేకరణ ఏజెంట్లు, అదే మండలంలోని పందిపాడు ప్రాంతంలో మరో ఏజెంట్ పాలు కల్తీ చేస్తున్నట్లు ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో వారు కొన్ని శాంపిల్స్‌ను పరిశీలించగా ఫ్యాట్ ఎక్కువగా చూపించడానికి చక్కెర, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను మిక్స్ చేసినట్లు గుర్తించారు. కల్తీ చేస్తున్న వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేశారు. ఆరుగురికి జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల జరిమానా విధించారు. నగదు చెల్లించని పరిస్థితుల్లో వారికి సంబంధించిన ఆస్తులను వేలం వేయాలన్నారు. కాగా కొన్నిచోట్ల యూరియా కూడా కలుపుతున్నట్లు విమర్శలున్నాయి. అయితే జిల్లాలో ఈ విధమైన ఫిర్యాదులు ఎక్కడా లేవని అధికారులు చెబుతున్నారు.

కల్తీతో ప్రమాదాలు

కాగా చక్కెర, సన్‌ఫ్లవర్ ఆయిల్ కలపడంతో ప్రమాదం ఉండదని కొందరు భావించినా.. పచ్చి పాలల్లో ఆ రెండింటిని కలపడంతో అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అధికారులు తనిఖీలు చేసి ఆరుగురిపై చర్యలు తీసుకోవడంతో కల్తీకి అడ్డుగట్ట పడింది. ఇంకా ఎక్కడైనా పాలు కల్తీ చేస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



ఎక్కడైనా పాలు కల్తీ చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులకు అనుమానం వస్తే ఈ విషయాన్ని మా దృష్టికి తీసుకురావాలి. పాలే కాదు ఏవైనా ఆహార పదార్థాలను కల్తీ చేస్తే మాత్రం చర్యలు తప్పవు.

– వెంకటేశ్వర్లు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

కల్తీ చేయడం సరికాదు



పాలను కల్తీ చేయడం చాలా తప్పు. వాటిని ఎక్కువగా చిన్న పిల్లలే వినియోగిస్తుంటారు. కొందరు ఏజెంట్లు డబ్బులకు కక్కుర్తి పడి ఈ విధంగా చేయడం మానుకోవాలి. అలాగే కల్తీ చేసే వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటే మరొకరు చేయరు.

– చంద్రయ్య, రామతీర్థం

రేపటి నుంచి పలు రైళ్ల రద్దు

గూడూరురూరల్: గూడూరు – మనుబోలు మధ్య మూడో రైల్వే లైన్ పనుల కారణంగా ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేసినట్లు గూడూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూళ్లూరుపేట – నెల్లూరు, నెల్లూరు – సూళ్లూరుపేట, విజయవాడ – గూడూరు, బిట్రగుంట – చెన్నై, తిరుపతి – గూడూరు మెమూ ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే గూడూరు – సికింద్రాబాద్ మార్గంలో నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్, గూడూరు – విజయవాడ మధ్య నడిచే విక్రమ సింహపురి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతాయన్నారు. గూడూరులో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు వేదాయపాళేనికి వెళ్లాలని సూచించారు. అదే విధంగా విజయవాడ – చెన్నై పినాకినీ ఎక్స్‌ప్రెస్, జనశతాబ్ది, నర్సాపూర్ – ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడం జరిగిందన్నారు. పూర్తి వివరాలకు ప్రయాణికులు రైల్వేస్టేషన్ ఎంక్వయిరీలో సంప్రదించాలని సూచించారు.

నెల్లూరులో ర్యాలీ నేడు

నెల్లూరు(దర్గామిట్ట): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా చేపడుతున్న నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 9 గంటలకు నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రం నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొని దేశభక్తి చాటాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలియజేశారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డిని సత్కరిస్తున్న లీగల్ సెల్ నాయకులు

నెల్లూరు(లీగల్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరులోని హోటల్ శివం కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జరిగిన న్యాయవాదుల పరిచయ కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసిందన్నారు. మృతిచెందిన న్యాయవాది కుటుంబానికి మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.4 లక్షలు, అలాగే ప్రతి జూనియర్ న్యాయవాదికి లా నేస్తం పథకం కింద నెలకు రూ.5 వేలు చొప్పున చెల్లించడం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో న్యాయవాదులు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి కౌంటింగ్ వరకు పూర్తి స్థాయిలో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు ప్రభుత్వంపై రోజూ అసత్య ఆరోపణలు చేస్తున్నాయని తెలిపారు. వాటిని ఎదుర్కోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను నిరోధించేందుకు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం లాంటి అనైతిక పనులు చేస్తున్నారని చెప్పారు. లీగల్ సెల్ న్యాయవాదులు ప్రజల్లో చైతన్యం కలిగించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్, ఇళ్ల స్థలాల కోసం ప్రత్యేక కమిటీని వేసి ముఖ్యమంత్రి పరిశీలనకు పంపి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఆర్.రోజారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, జిల్లాలోని వివిధ కోర్టుల న్యాయవాదులు పాల్గొన్నారు.

5.63 లక్షల మందికి మాత్రల పంపిణీ రేపు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

అనుమసముద్రంపేట: జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న వారు 5.63 లక్షల మంది ఉన్నట్లు గుర్తించామని, వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలను గురువారం ఇవ్వనున్నట్లు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. ఏఎస్‌పేట, చిరమన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. వైద్యశాలకు వచ్చిన ప్రతి ఒక్కరికీ సక్రమంగా వైద్యం అందించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి విధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈనెల 10వ తేదీన జరిగే నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 10న మధ్యాహ్నం ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తారన్నారు. ప్రతి కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎపిడమిక్ అధికారి డాక్టర్ ప్రమోద్, ఏఎస్‌పేట వైద్యులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ మంజుల, డాక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

‘ఎల్లో మీడియా వార్తలో నిజం లేదు’

ఆత్మకూరు(మర్రిపాడు): ఇటీవల మర్రిపాడు మండలంలోని నాగినేనిగుంటకు చెందిన వలంటీర్ ఓ మహిళ వద్ద అమ్మఒడి నగదు తస్కరించారంటూ ఎల్లో మీడియాలో వచ్చిన వార్తలో నిజం లేదని తేలింది. మంగళవారం నాగినేనిగుంట గ్రామంలో మహిళను సచివాలయ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఖాసీం పీరా అనే వలంటీర్ నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ తమకు ప్రభుత్వపరంగా అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అతడితో ఎలాంటి ఇబ్బందిలేదని ఆమె తెలిపింది. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తన చేత పథకం ప్రకారం అమ్మఒడి నగదు కాజేశాడని మాట్లాడించారని ఆమె వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఎల్లోమీడియా అబద్ధాలు ప్రచురించడం మానాలని గ్రామస్తులు కోరారు.

రెవెన్యూ గ్రామంగా కుడితిపల్లి : జేసీ



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

మనుబోలు: ఇప్పటి వరకూ ఇనామ్ గ్రామంగా ఉన్న కుడితిపల్లిని రెవెన్యూ గ్రామంగా మార్పు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కుడితిపల్లి గ్రామానికి సంబంధించిన భూ రికార్డులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ గ్రామంగా మార్చడానికి గెజిట్ పబ్లికేషన్ చేశామన్నారు. ఇంకా జిల్లాలో ఆరు ఇనామ్ గ్రామా లున్నాయని వాటిని రెవెన్యూ గ్రామాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కుడితిపల్లి గ్రామ రికార్డులను కమిషనర్ సర్వే ల్యాండ్స్‌కు పంపుతామన్నారు. గ్రామసభ నిర్వహించి రైతులకు పట్టాలను మంజూరు చేస్తామన్నారు. ఇప్పటి వరకూ 230 గ్రామాల్లో రీసర్వేని చేశామన్నారు. మిగతా చెట్ల ఈనెల 31వ తేదీలోగా పూర్తి చేస్తామన్నారు. ఇంకా 480 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే 100 గ్రామాల్లో డ్రోన్ సాయంతో తీసిన ఓఆర్ఐ మ్యాప్ లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ఇంటింటి సర్వే మొదలుపెడతామన్నారు. కార్యక్రమంలో డీఐఓ శ్రీరామమూర్తి, తహసీల్దార్ శివకృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంట కలిసిన మానవత్వం

- పేడదిబ్బలో పిండం

బుచ్చిరెడ్డిపాళెం: చేసిన తప్పు నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మానవత్వాన్నే మరిచిందో ఓ తల్లి. తన కడుపులోని నెలలు నిండని ఆడ పిండాన్ని అబార్షన్ ద్వారా తొలగించి పేడదిబ్బలో పడేసింది. ఈ ఘటన మండలంలోని మునులపూడి శివారులో మంగళవారం వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొందరు పాడిరైతులు పేడను తీసుకుని ఊరిశివార్లలో ఉన్న దిబ్బల వద్దకు వెళ్లగా పిండం కనిపించింది. వెంటనే సర్పంచ్ వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆశావర్కర్లతో కలిసి పరిశీలించారు. పిండం వయసు సుమారు ఆరు నెలలు ఉంటుందని, గుర్తుతెలియని మహిళ అబార్షన్ ద్వారా తొలగించుకుని పడేసినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు పిండాన్ని పేడదిబ్బలో పడేసి ఉంటుందని స్థానికులు తెలిపారు.

15 నెలల పాపకు హార్ట్ సర్జరీ



మాట్లాడుతున్న నారాయణ వైద్యుల బృందం

నెల్లూరు సిటీ: నారాయణ ఆస్పత్రి వైద్యులు 15 నెలల పాపకు ఓపెన్ హార్ట్ సర్జరీని విజయవంతంగా చేశారు. నెల్లూరులోని ఆ ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్ డాక్టర్ రామ్‌కుమార్ మంగళవారం వివరాలు వెల్లడించారు. సంగం ప్రాంతానికి చెందిన లక్ష్మీభార్గవికి 15 నెలల వయసున్న పాప ఉంది. పాపకు గుండెలో సమస్య ఉంది. చెన్నై, తిరుపతి, బెంగళూరు నగరాల్లోని హాస్పిటల్స్‌లో చూపించినా శస్త్రచికిత్స వీలుకాదని చెప్పడంతో నారాయణ ఆస్పత్రికి వెళ్లారు. పాప గుండెలో కండరం పెరిగినట్లు గుర్తించారు. తీవ్రమైన పల్మనరీ, హైపర్ టెన్షన్‌తో గుండెలోని పంపింగ్ గదుల మధ్య రంధ్రం ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. డాక్టర్ టీఆర్ ద్వారకానాథ్ మాట్లాడుతూ 15 నెలల చిన్నారి 10 కిలోల బరువు ఉండాలని, అయితే పాప 5.5 కిలోల తక్కువ బరువుతో ఉందని తెలిపారు. డాక్టర్ హరీష్ బృందం సహకారంతో సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. సమావేశంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి, హరీష్, ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- డ్వామా పీడీ వెంకట్రావ్



నెల్లూరు(పొగతోట): ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ వెంకట్రావ్ తెలిపారు. నెల్లూరులోని డ్వామా కార్యాలయం నుంచి మంగళవారం వివిధ మండలాల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. నా భూమి – నా దేశానికి సంబంధించిన శిలాఫలకాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో ఒక శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో పంచాయతీకి 75 మొక్కలు కేటాయించడం జరిగిందన్నారు. ప్రహరీ ఉన్న కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కల నిర్వహణకు మూడు సంవత్సరాలు నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు గుర్తించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

నెల్లూరు(దర్గామిట్ట): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలోని శ్రీవేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తల ఉపన్యాసాలు, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారని తెలియజేశారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

అనుమసముద్రంపేట: మామిడితోట కాపలాదారులపై దాడికి పాల్పడిన కేసులో ఆరుగురి నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌పేట ఎస్సై నరేష్ తెలిపారు. హసనాపురంలో మామిడితోట వద్ద సూర్యనారాయణరెడ్డి, హరికృష్ణ కాపలాదారులుగా ఉంటున్నారు. మూడ్రోజుల క్రితం సంగం మండలం తరుణవాయికి చెందిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి ఒంటి గంట సమయంలో జింకల వేటకు మామిడి తోట వద్దకు వెళ్లారు. కాపలాదారులు గమనించి ప్రశ్నించగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తరుణవాయికి చెందిన కాపా వెంకటేశ్వర్లు, ప్రసాద్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరి మృతి




నోబో బిస్వాస్, జుకీ బిస్వాస్ మృతదేహాలు

- మొత్తం నాలుగుకు చేరిన మృతుల సంఖ్య
- మృతులంతా పశ్చిమబెంగాల్ యువకులే

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప సమీపంలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలోని మృతుల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఆగిఉన్న మారుతీ ఓమ్నీ వ్యాన్‌ను లారీ ఢీకొన్న ఘటనలో పశ్చిమబెంగాల్‌కు చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నెల్లూరులో చికిత్స పొందుతున్న పశ్చిమబెంగాల్ యువకులు ఆకాష్ మండల్ (20), దినేష్ మండల్ (21) సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. వీరితో పాటు తీవ్రంగా గాయపడిన నోబో బిస్వాస్ (24), జుకీ బిస్వాస్ (35) కూడా నెల్లూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పొట్టకూటి కోసం పశ్చిమ బెంగాల్ నుంచి బెంగళూరుకు వెళుతున్న వీరిని లారీ రూపంలో మృత్యువు కబళించడంతో మృతుల కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. మృతులంతా పశ్చిమబెంగాల్ రాష్ట్రం బైతిగచ్చా గ్రామానికి చెందిన వారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు బెంగళూరులో కార్మికులుగా పనిచేసేందుకు తెలిసిన వారి సాయంతో మారుతీ ఓమ్నీ వ్యాన్‌లో స్వగ్రామం నుంచి వెళుతుండగా కప్పరాళ్లతిప్ప సమీపంలో టైర్ పంక్చర్ కావడం వీరి పాలిట శాపంగా మారింది. వ్యాన్‌ను రోడ్డు పక్కన నిలిపి టైర్ మారుస్తుండగా కావలి నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ వేగంగా ఢీకొనడంతో మొత్తం ఐదుగురు గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్రగాయాలవగా చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

కొండాపురం: మండలంలోని గరిమెనపెంట, వెంకటరంగాపురం గ్రామాల మధ్యనున్న అటవీప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై షేక్ ఖాజావలి తన సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,500, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎన్‌జీఓ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): ఏపీ ఎన్‌జీఓ సంఘం 21వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ బీ చిరంజీవి మంగళవారం ఆవిష్కరించారు. ఏపీఎన్‌జీఓ నాయకులు లక్కాకుల పెంచలయ్య, రమేష్, బీమారెడ్డి, మాబాషా, జెడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఓ మహిళను నమ్మించి నగదు, బంగారు ఆభరణాలు కాజేసి మోసగించిన నిందితుడు, అతని తల్లిదండ్రులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు..నగరంలోని జ్యోతినగర్‌కు చెందిన ఓ మహిళ భర్త నుంచి విడిపోయి విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటోంది. ఆమెను భర్త సహోద్యోగి అయిన విశాఖపట్నానికి చెందిన జగదీష్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇరువురి పెద్దలు సైతం వారికి వివాహం చేసేందుకు అంగీకరించారు. వివాహానికి ముందే కట్నం కింద రూ.6.50 లక్షలు నగదు, ఐదు సవర్ల బంగారు గొలుసును మహిళ కుటుంబసభ్యుల నుంచి జగదీష్ తీసుకున్నాడు. అనంతరం ఫోన్‌స్విచ్ఛాఫ్ చేశాడు. బాధిత మహిళ జగదీష్ తల్లిదండ్రులను సంప్రదించగా వారు నానా దుర్భాషలాడి దాడిచేసి గాయపరిచారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు సోమవారం రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు.

లారీ బీభత్సం

- మహిళ మృతి.. ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

బుచ్చిరెడ్డిపాళెం: సంగం నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న లారీ నగర పంచాయతీ పరిధిలో మంగళవారం బీభత్సం సృష్టించింది. లారీ డ్రైవర్ పూటుగా మద్యం తాగి వాహనాన్ని నడపడంతో అదుపుతప్పి రోడ్డుపై నడిచి వెళ్తున్న అరుణమ్మ(40) అనే మహిళను ఢీకొంది. అనంతరం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును సైతం ఢీకొనబోగా బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణమ్మను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆటో డ్రైవర్ శ్రీనివాసులుకు తీవ్రగాయాలవగా బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.123
లేయర్	రూ.88
బ్రాయిలర్ చికెన్:	రూ.216
స్కిన్‌లెస్ చికెన్:	రూ.240
లేయర్ చికెన్:	రూ.150

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.7

